www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 19 ఏప్రిల్ 2023

1

ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ - భీమిని

ప్రమాదవాశాత్తు చెట్టు పైనుంచి పడి మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం..మడే శంకర్(49) చెట్టుపై చింతకాయలు కోయడానికి ఎక్కాడు. కాలుజారి చెట్టు కింద ఉన్న ట్రాక్టర్‌పై పడి మృతి చెందాడు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.



ఉచిత వైద్య శిబిరం

ఖానాపూర్‌రూరల్ : వేసవి తాపం పెరుగుతున్న నేపథ్యంలో వైద్యశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ప్రజలకు ఉచిత మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది యోక్షన, మనీషా ఆశ వర్కర్లు సంధ్య, పద్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బాసర ఆలయంలో అదనపు కమిషనర్ తనిఖీలు

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాష్ట్ర అదనపు దేవాదాయ శాఖ కమిషనర్ కృష్ణవేణి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందుగా అమ్మవారిని దర్శనం చేసుకొన్న అనంతరం ఈవో కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆలయ మాస్టర్ ప్లాన్, లడ్డు సెంట్రల్ స్టోర్, నదీ తీరాన భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవోకు సూచించారు. వీరి వెంట ఆలయ ఈవో విజయరామారావు, ఏఈఓ సుదర్శన్‌గౌడ్, ఆలయ అధికారులు సిబ్బంది ఉన్నారు.

కలప రవాణాకు పాల్పడుతున్న వ్యక్తుల బైండోవర్

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మామిడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఉట్ల గిరిజన గ్రామానికి చెందిన కస్తూరి లక్ష్మణ్, మొడితె లచ్చన్న తరచు కలప అక్రమ రవాణాకు పాల్పడుతుండగా వారిని మంగళవారం తహసీల్దార్ హనుమంతరావు ఎదుట అటవీశాఖ అధికారులు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తాళ్లపేట రేంజ్ అధికారి రత్నాకర్‌రావు మాట్లాడుతూ గతంలో పలుమార్లు కలప అక్రమ రవాణా చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు. పలుమార్లు కేసులు నమోదు చేసి హెచ్చరించినా తీరు మార్చుకోవడం లేదని, ఈ క్రమంలో లక్ష రూపాయల పూచీకత్తుతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎవరైన కలప అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలప అక్రమ రవాణా సంబంధించిన సమాచారం అటవీ శాఖ సిబ్బందికి తెలియజేసి సహకరించాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి పోషమల్లు, సెక్షన్ అధికారి హనుమంతరావు, బీట్ అధికారి అనిత పాల్గొన్నారు.

సోయా విత్తనాలు తిని ఎద్దు మృతి

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని పీచర గ్రామానికి చెందిన రైతు పెరమాండ్ల భూమన్నకు చెందిన ఎద్దు కొట్టంలో భద్రపరిచిన సోయా విత్తనాలు తిని మృతి చెందింది. విత్తనాలు తినడంతో ఎద్దు ఎడుపు ఉబ్బింది. దీంతో రైతు మంగళవారం ఉదయం నేరడిగొండ పశు వైద్య కేంద్రానికి తీసుకొచ్చాడు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఎద్దు చనిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పేద కుటుంబం కావడంతో మళ్లీ ఎద్దు కొని వ్యవసాయం చేయలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ ఆదుకొని నష్టపరిహారం అందించాలని కోరాడు.

రేపు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ పట్టణంలో ఈ నెల 20న కోటపల్లి మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం సబ్బండ వర్గాల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పేద ప్రజలు, రైతుల సంక్షేమం కోసం సరికొత్త పథకాలను అమలు చేస్తుండడంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా ప్రతి పేదోడు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా సీఎం కేసీఆర్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటింటికీ ఆహ్వానం

జనగామ సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ 20న చెన్నూర్ పట్టణంలో ఎమ్మెల్యే బాల్క సుమన్ అధ్వర్యంలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి రావాలని ప్రతి గడపకు తిరుగుతూ ప్రతి వ్యక్తిని ఆహ్వానిస్తున్నారు. సీఎం కెసిఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తున్నారు. సంక్షేమ పథకాలతో గ్రామంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు.

ఆత్మారాం నాయక్‌కు సన్మానం

నవతెలంగాణ - రెబ్బెన

11 రోజులు జైలుశిక్ష అనుభవించి బయటకొచ్చిన బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆజ్మీరా ఆత్మారాం నాయక్‌కు మంగళవారం ఘన స్వాగతం పలికారు. గోలేటి టౌన్‌షిప్‌లోని అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి ఇంట్లో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లప్పుడు ప్రజల కోసం పరితపిస్తూ పోరాడుతూనే ఉంటానని, ప్రజల కోసమే తన జీవితమని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చేకూరి నవీన్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఎస్‌టి మోర్చా జిల్లా కార్యదర్శి మెస్రం గుణవంత్‌రావు, బీజేవైఎం మండలాధ్యక్షుడు మాత్రం అర్జున్, కుమురం సీతారాం, ఆత్రం నాగోరావు, కడప భీంరావు పాల్గొన్నారు.

రంజాన్ కిట్లు పంపిణీ

నవతెలంగాణ తాండూర్

బెల్లంపల్లి తాజ్ బాబా సేవాసమితి ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా అబ్దుల్ రహీం జ్ఞాపకార్థకం మండల కేంద్రంలో నిత్యావసర సరుకులు అందించారు. సమితి అధ్యక్షులు ఉస్మాన్ పాషా మాట్లాడుతూ పేదల కోసం తాజ్ బాబా సేవా సంస్థ ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజ్ బాబా సేవాసమితి సభ్యులు అబ్బుసాత్, హాజీబాబా, శ్రీనులాల్, బాదే విశ్వాస్, మధు పాల్గొన్నారు.

నేటి నుండి కంటి వెలుగు శిబిరం

వాంకిడి : మండలంలోని సవాతి గ్రామ పంచాయతీలో బుధవారం నుండి కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నామని సర్పంచ్ గొర్కటె దేవ్‌రావు తెలిపారు. ఈ అవకాశాన్ని కంటి చూపు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో అక్షరాస్యత కోసం కృషి

నవతెలంగాణ-తాండూర్

నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తున్నామని చౌటపల్లి యువశక్తి యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆర్గనైజర్ తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో చౌటపల్లి, లింగాధరిగూడెం, పోచంపల్లి గ్రామాల్లోని అంగన్వాడి కేంద్ర చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. దీనికి అతిథిగా అంగన్వాడీ సూపర్వైజర్ మమత హాజరై మాట్లాడుతూ సామాజిక సేవలో గుర్తింపు పొందాలంటే ప్రత్యేకమైన కార్యక్రమాలు చేపట్టాలరు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఫౌండేషన్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

పొన్కల్‌లో గౌడ కులస్తుల ఎల్లమ్మ బోనాలు

జన్నారం : మండలంలోని పొన్కల్ గ్రామంలో గౌడ కులస్తులు రేణుకా ఎల్లమ్మ బోనాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గౌడకులస్తులు డప్పు వాయిద్యాల నడుమ బోనాలతో ఎల్లమ్మ ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్, ముఖ్య సలహాదారులు గాజుల లింగన్నగౌడ్, ప్రధానకార్యదర్శి పోడేటి రమేష్‌గౌడ్, గౌడ కులస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు వెంటనే ఇండ్ల స్థలాలు అందించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్, మంచిర్యాలలో సంతకాల సేకరణ

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్, మంచిర్యాల

సమాజహితం కోసం పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెడపట్ల సురేష్, షేక్ మోయిస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ పత్రికలు, ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులు భారీగా హాజరై సంతకాలు చేసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టులు అనేక ఏండ్ల నుంచి అద్దె ఇండ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని ఇది వరకే హామీనిచ్చిందని వివరించారు. ఇప్పటికైనా నాన్చుడు ధోరణి ప్రదర్శించకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు అందజేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సంఘం ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. జిల్లా మీడియా కెమెరామెన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంట వినోద్, సలహాదారుడు దత్త్రాత్రి, ఎలక్ట్రానిక్ మీడియా టౌన్ రిపోర్టర్ల సంఘం అధ్యక్షుడు రాజేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రొడ్డ దేవిదాస్, ఉపాధ్యక్షులు ఎండీ.రఫీ, జర్నలిస్టులు దేవేందర్, నరేష్, సుధాకర్, కిరణ్, సుభాష్, గోపి, సంద సురేష్, అభిలాష్, గణేష్‌రెడ్డి, రాజన్న, నవీన్,శ్రీకాంత్, రవీందర్, మహేష్, కిరణ్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి, అస్మత్, ఖిజర్‌యాఫై, అమీమ్‌షరీఫ్, అశ్వాక్ పాల్గొన్నారు.



మంచిర్యాలలో..

అర్హులైన జర్నలిస్టులకు వెంటనే ఇండ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోట్ల మల్లేష్ యాదవ్, గోపతి సత్తయ్య డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇండ్ల సాధన కోసం మంగళవారం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఆయా యాజమాన్యాలు ఇచ్చే చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. కనీసం ఇండ్లు కూడా లేక అద్దె కట్టలేని పరిస్థితుల్లో జర్నలిస్టులున్నారన్నారు. జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం తెలంగాణ ఏర్పడ్డాక జర్నలిస్టులకు మొండి చేయి చూపించిందన్నారు. ఇతర జిల్లాలలో ఇప్పటికే ఇళ్ల స్థలాలు కేటాయించింది కానీ మంచిర్యాల జిల్లాలో అటువంటి చర్యలు కానరావడం లేదన్నారు. ఈ సమస్యలపై దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమం, రాబోవు రోజుల్లో రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, సాగర్, మధుసూదన్, లక్ష్మణ్, జాడి వెంకట్, శ్రీనివాస్, రాజబానయ్య పాల్గొన్నారు.



భయపెడుతున్న విష జ్వరాలు

ప్రతి ఇంట్లో ఒకరికి జ్వరం

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని మురళీగూడ గ్రామంలో విష జ్వరాలు భయపెడుతున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. మురళీగూడ గ్రామంలో గత వారం రోజుల నుండి జ్వరాలు రావడంతో గ్రామస్తులకు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు ఎక్కువగా ఉండడంతో కొంతమంది ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించి చికిత్స పొందుతున్నారు. గ్రామాల్లో మరికొంత మంది స్థానిక ఆర్ఎంపీల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. గ్రామంలోని ప్రతి ఇంట్లో జ్వర బాధితులు ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది రెండు సార్లు వైద్యశిబిరాలు నిర్వహించి రోగుల నుండి రక్త నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపించారు. జ్వరాలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆమన్‌ను సంప్రదించగా రక్త నమూనాలు సేకరించామని, వాటి ఫలింతాల ఆధారంగా డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా ఎలాంటి జ్వరాలో తెలుస్తుందన్నారు. దేనివల్ల జ్వరాల బారిన పడ్డారో అర్థమవుతుందని తెలిపారు. వైద్య శిబిరాల్లో వైద్యాధికారి లేకుండానే హెల్త్ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలతో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో మెగా వైద్యశిబిరం నిర్వహించి ప్రత్యేక వైద్య బృందాలను తీసుకొచ్చి ప్రజలందరికి వైద్య పరీక్షలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి



మురళీగూడలో వైద్యశిబిరం(ఫైల్)

డీపీఆర్ఓ విష్ణువర్ధన్‌కు సన్మానం

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పౌరసంబంధాలశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈ.విష్ణువర్ధన్‌ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం డీపీఆర్ఓ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. సంఘం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. డీపీఆర్ఓను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెడపట్ల సురేష్, షేక్ మోయిస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రొడ్డ దేవిదాస్, జర్నలిస్టులు దేవేందర్, సుధాకర్, ఎండీ.రఫీ, సంద సురేష్, అస్మత్, రాజేష్, సుభాష్, అరుణ్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, రాజన్న, శ్రీకాంత్, అమీమ్‌షరీఫ్, నవీన్ పాల్గొన్నారు.





కెమెరామెన్ అసోసియేషన్ అధ్వర్యంలో..

జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి(డిపిఆర్ఓ)గా బాధ్యతలు స్వీకరించిన విష్ణువర్ధన్‌ను మీడియా కెమెరామెన్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మీడియా కెమెరామెన్ పక్షాన నూతన డిపిఆర్ఓకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు గంట వినోద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవినాష్‌రెడ్డి, సభ్యులు శ్రీనివాస్, శానం కిరణ్, విఠల్, పవన్, జెకె కిరణ్, అస్మత్ అలీ, రోహిత్, భూమేష్, గణేష్‌రెడ్డి, నర్సింగ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికొదిలేసిన కేసీఆర్ : రాథోడ్ రమేష్

జన్నారం : కేసీఆర్ ప్రజాసమస్యలు గాలికొదిలేసి, దోచుకొనేందుకే రాజకీయాలు చేస్తున్నారని ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రమేష్ రాథోడ్ మండిపడ్డారు. మంగళవారం మండలంలోని తపాలపూర్ గ్రామంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కేసీఆర్ అవినీతి పాలనపై ప్రజలను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోయినా పట్టించుకోకుండా ప్రజాప్రతినిధులు దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలు ప్రజలకు కంటితుడుపు చర్యగానే మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, ఎంపీటీసీలు మధుసూదన్‌రావ్, వెంకటస్వామి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఆజ్మీరా బద్రి నాయక్, మహ్మదాబాద్ సర్పంచ్ లక్ష్మణ్, సింగరాయిపేట్ మాజీ సర్పంచ్ దుబ్బా రాజన్న, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు గుంటుకు కొమురయ్య, యుగేందర్, ఖానాపూర్ అసెంబ్లీ ఐటీ సెల్ కోకన్వీనర్ జగన్, బూత్ అధ్యక్షులు బండి రాజన్న, నాడెం సతన్న, గోపాల్, బీజేపీ నాయకులు మల్లికార్జున్, చందనగిరి నగేష్, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్రంలో సెర్ప్ సంస్థలో 20 ఏండ్ల నుండి పనిచేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. సమ్మెలో భాగంగా మంగళవారం వీఓఏలకు మద్దతు తెలిపి మాట్లాడారు. కొన్నేండ్ల నుండి ఐకేపీలో వీఓఏలుగా పనిచేస్తున్న వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి వారితో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగభద్రత కల్పించాలని, కనీస వేతనం నిర్ణయించి అమలుచేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, ఆన్‌లైన్ పనులు రద్దుచేయాలని, సెర్ప్ నుండి ఐడీ కార్డులు ఇవ్వాలని, ప్రతి సంఘానికి పక్కా భవనం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జాడె అనిల్‌కుమార్, మండలాధ్యక్షుడు అంగాల సతీష్, నాగపురె పాండు, ప్రధాన కార్యదర్శి గొర్కుటె జయంత్, బానోత్ అంబావతి, స్వప్న, ప్రేమల, సునీత, జ్యోతి, నిర్మల పాల్గొన్నారు.

వాంకిడి : ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సమ్మె నిర్వహించారు. వీఓఏలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఫీజుల నియంత్రణ పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా



నవతెలంగాణ-మంచిర్యాల

విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ కలెక్టర్ ఆఫీస్‌ను బీసీ, ఎస్సీ హాస్టల్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కోసం చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరారు. గురుకులాలలో సమ్మర్ క్యాంప్ పేరిట తరగతుల నిర్వహణ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సౌమ్య, అభినయ, కల్పన, శ్రావ్య, నాగలక్ష్మి, శ్యామల, అక్షయ్, నస్పూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి సత్యనారాయణ, ఈదునూరి అభినవ్, మండల నాయకులు రాకేష్, కిరణ్‌తేజ, మాంతయ్య నితిన్, సాయి, జస్వంత్, ప్రేమ్, అంజన్న పాల్గొన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-దండేపల్లి

పేద మధ్యతరగతి ప్రజల అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కొరకు అన్ని విధాల కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ద్వారక, నంబాల, ధర్మారావుపేట, పెద్దపేట్, కొత్త మామిడిపల్లి గ్రామాలలో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా రూ.92 లక్షలతో చేపట్టిన నూతన పాఠశాల భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు మన ఊరు మనబడి పథకం తీసుకొచ్చి పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలలు వదిలి ప్రభుత్వ పాఠశాలల దారిపట్టే రోజు వస్తుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నానని, అందుకే ప్రజలు తనను ఆదరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ లింగన్న, ఎంపీపీ శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్లు కాసనగొట్టు లింగన్న, సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పొడవునా స్తంభాల తొలగింపు

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రధాన దారికి ఇరువైపులా అతి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలను మంగళవారం తొలగించి, నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా నిర్వహించి త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ తెలిపారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా వాహన చోదకులకు ఇబ్బందిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం, మున్సిపల్ కమిషనర్ చిక్యాల రత్నాకర్ రావు, మున్సిపాలిటీ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గ్రామం నుంచి సర్వీస్ రోడ్డు నిర్మించొద్దు

నవతెలంగాణ-గుడిహత్నూర్

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న పీయూసీ బ్రిడ్జికి అనసంధానంగా గ్రామం నుంచి సర్వీస్ రోడ్డు నిర్మంచవద్దని మంగళవారం తహసీల్దార్ సంధ్యారాణికి చత్రపతి శివాజీ యూత్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం నుంచి సర్వీస్ రోడ్డు నిర్మిస్తే నివాస, వ్యాపార సముదాయాలు దెబ్బతింటాయని, అదే మార్గంలో శివాలయం, మస్జీద్, చర్చిలతో పాటు సాయిబాబా మందిరాలు ఉన్నాయని అన్నారు. సర్వీసు రోడ్డు నిర్మాణంతో పాఠశాల విద్యార్థులతో పాటు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వెల్లడించారు. రాజకీయ నాయకుల స్వార్థం కోసం డిజైన్ మార్చవద్దని ప్రజల ఆభీష్టం మేరకు నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు కేంద్రే సందీప్, తిడ్కే శివ, విఠల్ కేంద్రే, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గిత్తే తరుణ్, నీతిష్ ఉన్నారు.

విద్యార్థులకు కరోనా నిర్ధారణ పరీక్షలు

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో మంగళవారం విద్యార్థిని, విద్యార్థులకు కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. యూనివర్సిటీలోని కెమికల్ అధ్యాపకుని కరోనా నిర్ధారణ కావడంతో అప్రమత్తమైన యూనివర్సిటీ అధికారులు యూనివర్సిటీలోని ఆస్పత్రి ఆవరణలో మెడికల్ ఆఫీసర్ ఆకాష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సుమారు 200 మంది విద్యార్థిని విద్యార్థులకు కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఎ విద్యార్థికి కరోనా లక్షణాలు లేవని, అందరికీ నెగిటివ్ వచ్చిందని యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. విద్యార్థుల కరోనా నిర్ధారణ పరీక్షలను జిల్లా డీఎంహెచ్ఓ ధనరాజ్ పరిశీలించి, వైద్య సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. వీరి వెంట యూనివర్సిటీ ఆస్పత్రి సిబ్బంది, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందించాలి



నవతెలంగాణ-నార్నూర్

వార్షిక పరీక్షలు అయిన వెంటనే చివరి రోజు ఒకటో తరగతి నుండి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందించాలని ఎంఈఓ రాపేల్లి ఆశన్న ఉపాధ్యాయులను సూచించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు కొత్తపెల్లి, భీంపూర్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మేటివ్, అసైన్మెంట్-2 వార్షిక పరీక్షల తీరును పరీక్ష పత్రాలను పరిశీలించారు. వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

అంబలి పంపిణీ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కడెం

నచ్చన్ఎల్లాపూర్ గ్రామంలో సర్పంచ్ బొడ్డు గంగన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని, చలివేంద్రాన్ని ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దహం తీర్చడానికి చలివేంద్రం, అంబలి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసినందుకు సర్పంచ్ బొడ్డు గంగన్నను అభినందించారు. ఇలాంటి మంచి పనులు మరిన్ని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, సర్పంచ్ బొడ్డు గంగన్న, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, నిర్మల్ జిల్లా జెడ్పీ కోఆప్షన్ నెంబర్ ఎండీ రఫీక్, ఆత్మ కమిటీ చైర్మెన్ సతీష్, భుక్యా కిషన్ నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



నవతెలంగాణ-నార్నూర్

ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం సందర్భంగా మైనార్టీ పేదవారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న రంజాన్ తోఫాను మంగళవారం మండల కేంద్రంలోని మజీద్‌లో 120 మంది ముస్లిం పేదలకు జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులు సీఎం కేసీఆర్ అందరి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉపవాస దీక్షలో ఉన్న మైనార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను నిండు మనసుతో దీవించాలని అన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు...

పవిత్ర రంజాన్ మాసంలో రోజంతా ఉపవాసంతో ఉన్న ముస్లింలు సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ ఆడే సురేష్, బీఆర్ఎస్ నాయకులు కనక ప్రభాకర్, కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, బీఆర్ఎస్ మండల కార్యదర్శి ఖాసిం, హసన్, ఫిరోజ్ ఖాన్, అహ్మద్, మాణిక్ రావ్, మహేందర్, బాబా ఖాన్, మజీద్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాటి ముంజలకు భలే గిరాకీ...



నవతెలంగాణ-ఉట్నూర్

వేసవి కాలంలో లభించే తాటి ముంజలంటే ప్రజలకు అత్యంత ప్రీతని చెప్పవచ్చు. మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో తాటి ముంజలను అమ్ముతుండగా ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. వంద రూపాయలకు 12 తాటి ముంజలను విక్రయిస్తున్నారు. తాటి ముంజలు తినడం వల్ల చల్లదనంతో పాటుగా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పలువురు వైద్యనిపుణులు అంటున్నారు. సహజ సిద్ధమైన పండ్లు తినడం ద్వారా ఆరోగ్యానికి మంచిదని పేర్కొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చడంలో జోగు రామన్న విఫలం

నవతెలంగాణ-బేల



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాటానికి వస్తున్నా మీ అడపడుచుగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొబ్బాయి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితమైందని, కొబ్బాయి గ్రామంలో ప్రజలకు కనీస వసతులు లేవని, గ్రామంలో పీహెచ్‌సీ నిర్మాణం పూర్తయిన ఇప్పటి వరకు దాన్ని ప్రారంభించలేదని, గ్రామంలో ఒక్కరికీ కూడా డబుల్ బెడ్ రూం అందలేదని, రైతులకు రుణమాఫీ జరగలేదని, జోగు రామన్న ఇకనైనా అభివృద్ధిపై దృష్టి సారించాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దత్త నిక్కం, జీవన్, ప్రమోద్ రెడ్డి, సందీప్, గటిక క్రాంతి కుమార్, సంతోష్ కొత్తపెల్లి, గన్నోజి విజయ్, సతీష్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, కాంత, ప్రశాంత్, శివ కిరణ్, రుతిక్ ఉన్నారు.

రాజకీయ చదరంగంలో యువత పావులు కావొద్దు

- సీపీఐ(ఎం) ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్



రాజకీయ చదరంగంలో యువత పావులు కావొద్దని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. మంగళవారం సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవంతమైన అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నీరుగార్చే కుట్రలో భాగామే అల్లర్ల సృష్టి అని తెలిపారు. అంబేద్కర్ భావజాలం నచ్చని మనువాద బీజేపీ నాయకుల హస్తం అందులో దాగివుందని తేల్చి చెప్పారు. యువత వారి రెచ్చగొట్టే మాటలను నమ్మి బలిపశువులు కావొద్దని హితవు పలికారు. ప్రజలు బీజేపీ ఎంపీని గెలిపించినందుకు ఆ పార్టీ నాయకులు జిల్లా అభివృద్ధిపైన దృష్టి సారించాలని కోరారు. ఇంతవరకు పట్టణానికి ఒక కొత్త పరిశ్రమను కూడా తీసుకురాలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో బీజేపీ నాయకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఖాయిలా పడ్డ సీసీఐని తెరిపించకపోగా పరిశ్రమను తుక్కుకింద అమ్మేయ్యాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు వేయాలన్న రైల్వే లైన్ కలగానే మిగిలిపోయిందని అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో విమానాశ్రయ ఏర్పాటు నిర్లక్ష్యానికి గురవుతోందని ఆరోపించారు. పేదల నిత్యవసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌ల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు కొనుక్కుని తినలేని స్థితిలోకి నెట్టివేయబడ్డారని అన్నారు. సదరు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన కేంద్రంలోని బీజేపీ మాత్రం ప్రజల మధ్య వైశమ్యాలు సృష్టించి ప్రజల దృష్టిని మళ్లించే పనిలో ఉంటుందన్నారు. బీజేపీ కుట్ర పూరిత వ్యూహాలను ప్రజలు గమనించాలని కోరారు. జిల్లా అభివృద్ధికోసం యువత పోరాడాలని పిలుపునిస్తూ అనవసర అల్లర్లలో చిక్కుకుని జైళ్ల పాలై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటి సభ్యులు బొజ్జ ఆశన్న, ఎం.గంగన్న, ఆర్ .సురేందర్, ఆర్.మంజుల పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ-నిర్మల్

ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో పలువురు వీఓఏలు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గత కొన్ని రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దారుణమని అన్నారు. రాష్ట్రంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు వేతనాలు పెంచిన ప్రభుత్వం వీఓఏలకు వేతనాలు ఎందుకు పెంచడం లేదో అర్థం కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం నిరవధిక సమ్మె బాట పట్టారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం చెల్లించాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఐకేపీ వీఓఏల జిల్లా కమిటీ ఎన్నిక

ఐకేపీ వీఓఏల నూతన జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా బొమ్మెన సురేష్, జిల్లా అధ్యక్షులుగా బి.జయశీల, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, భోజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాయన్న, జిల్లా సహాయ కార్యదర్శిలుగా పోతన్న, లావణ్య, గంగాధర్, జిల్లా కోశాధికారిగా సప్న, జిల్లా కమిటీ సభ్యులు 18 మందిని ఎన్నుకున్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

నవతెలంగాణ-సిరికొండ



తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్నటువంటి సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటింటికి వెళ్లి చెప్పాలని అన్నారు. రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, ఒంటరి మహిళ, వితంతు పింఛన్లు, దళితబంధు తదితర పథకాలను ప్రవేశ పెట్టి అభివృద్ధిలో దూసుకు పోతోందని అన్నారు. ఇది చూసి ప్రతిపక్ష పార్టీలకు మింగుడు పడక ఎం చేయాలో అర్థం కావడం లేదని అన్నారు. అవగాహన రాహిత్యంతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మోసపూరితమైన మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని అన్నారు. గ్రామాల అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. ఎప్పుడు లేని విధంగా గ్రామాలలో పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు ఇంక ఎన్నెన్నో అభివృద్ధి పనులను చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కుల మతాలకతీతంగా పాలన జరుగుతుందని అన్నారు. మహిళలకు బతుకమ్మ చీరలను, రంజాన్ మాసంలో ముస్లింలకు రంజాన్ కానుకలను ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని అన్నారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి ఎంపీపీ శోబాబాయి, మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీరామ్, మండల నాయకులు రాజారాం, బషీర్, విజయ్ కుమార్, సునీల్, విఠల్ పటేల్, గోవర్ధన్, లచ్చిరాం, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే...

మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించిన ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకుల కుటుంబాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖ నాయక్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆమె వెంట ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీరామ్, ఇంద్రవెల్లి ఎంపీపీ శోబాబాయి, స్థానిక నాయకులు విజయ్ కుమార్, రాజారాం ఉన్నారు.

ట్రాక్టర్ కిస్తులు చెల్లించకపోవటంతో కార్యదర్శులకు నోటీసులు

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పల్లెప్రగతిలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా పంచాయతీకీ నిధులు రాకపోవడంతో నెల వారిగా ట్రాక్టర్ రుణం కిస్తులు బ్యాంక్‌కు చెల్లించకపోవటంతో పంచాయతీ కార్యదర్శులకు నోటిసులు అందుకుంటున్నారు. ఆదాయం ఉన్న పంచాయతీలు ఒక్క సారి నగదు చెల్లించి ట్రాక్టర్‌లు కొనుగోలు చేశారు. ఆదాయం తక్కువ ఉన్నా గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించడంతో ట్రాక్టర్‌లు తీసుకున్నారు. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు సకాలంలో విడుదల చేయకపోవటంతో సమస్య తలెత్తింది. బ్యాంకులకు చెక్కులు పంపిన పాస్ కాకపోవటంతో పంచాయతీ కార్యదర్శులకు ట్రాక్టర్ కిస్తులు చెల్లించటం లేదని బ్యాంకు సిబ్బంది పంచాయతీ కార్యదర్శులకు నోటిసులు పంపించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే మండలంలోని గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్ కోసం ఎస్బీఐ బ్యాంకు వారు రుణం ఇచ్చారు. ప్రతి నెల నెల వాయిదాల పద్ధతిలో గ్రామపంచాయతీ వారు చెల్లించాలి. అయితే పంచాయతీ నిధులు బ్యాంక్‌కు జమాకాలేదు. మండలంలోని గన్నోర గ్రామపంచాయతీ ట్రాక్టర్ రుణం బకాయి రూ.50,351, మచ్కల్‌కు రూ. 47,036, ఎడ్‌బిడ్ తండకు రూ. 24, 237, వెంకటాపూర్‌కు రూ.47,026, రువ్వి రూ.51, 605 పంచాయతీ ట్రాక్టర్ కిస్తులు బ్యాంక్‌కు జమకాలేదు. దీంతో ఎస్బీఐ బ్యాంకు అధికారులు పంచాయతీ కార్యదర్శులకు, నోటిసులు అందజేశారు. తక్షణం బకాయి పడ్డ కిస్తులు చెల్లించాలని, లేని ఎడల మీ వ్యక్తిగత అకౌంట్ సిబిల్ స్కోర్ పడిపోతుందని బ్యాంకు సిబ్బంది హెచ్చరించినట్లు కార్యదర్శులు పేర్కొన్నారు. అయితే మేము పంచాయతీ నిధుల నుండి చెక్కులను బ్యాంకు అకౌంట్‌కు పంపినప్పటికి డబ్బులు జమా కాకపోవటంతో, బ్యాంకు వారు నోటిసులు ఇచ్చారని కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఈవిషయమై ఎంపీడీఓ సురేష్‌బాబు వివరణ కోరగా బ్యాంకు నుండి నోటిసులు వచ్చిన మాట వాస్తవం అన్నారు. బ్యాంకు వారికి పంచాయతీ నుండి చెక్కు పంపిచినప్పటికి ఇంకా డబ్బులు జమ కాకపోవటంతో నోటిసులు వచ్చాయని తెలిపారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యానికి పాలకుల కుట్ర

నవతెలంగాణ-నిర్మల్



ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యానికి పాలు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేజీ.రామచంద్రన్ అన్నారు. మంగళవారం జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో నిర్వహించారు. జండా ఆవిష్కరించి, అమర వీరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వర్గాలకు అనేక రాయితీలు కల్పిస్తూ ప్రజలపై పన్నుల భారం మోపుతున్నాయని విమర్శించారు. పేదలకు అరకొరగా కొన్ని పథకాలు ప్రవేశపెట్టి ఆచరణలో అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం దోడ్డుగా, ముక్కి పోయి ఉండటంతో ప్రజలు తినేటట్లుగా ఉండటం లేదని, ప్రజలకు ఉపయోగపడేటట్లుగా సన్నబియ్యం నాణ్యమైనవి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు, ప్రజలకు ఉపాధి అవకాశాలు సరిగా లేక ఆదాయాలు తగ్గిపోవడంతో కొనుగోలు శక్తి లేక ప్రజలు దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, పేదల సంక్షేమ పథకాలకు అమలులో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. పది కిలోల సన్న బియ్యం, వీటితో పాటు వంట నూనె, కందిపప్పు, పెసరపప్పు, టీపొడి, పంచదార, గోధుమపిండి, పసుపు, కారం, పల్లీలు, చింతపండు, సబ్బులు రేషన్ షాపుల ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇటీవల కాలంలో పేదలు ఉపయోగించుకునే గ్యాస్‌పై సబ్సిడీ ఎత్తివేయడంతో వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని, సబ్సిడీ పై గ్యాస్ సరఫరా చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా కార్యదర్శి వర్గ సభ్యులు కే. రమ, రాష్ట్ర నాయకులు వీ.ప్రభాకర్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మీ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బక్కన్న, రామలక్ష్మణ్, నాయకులు గంగన్న, మహిమూద్, గఫూర్, బీమవ్వ, మహేందర్, నవీన్, అంకుషరావ్, జుగేద్‌రావ్, జగన్‌సింగ్, నంది సమాత, ఎల్లన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 21న ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 21న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరుగుతుందని పార్టీ జిల్లా అధ్యక్షులు సాజిద్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 21న ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మాజీ క్రికెటర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ అజారుద్దీన్, సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి, టీపీసీసీ ఎల్‌డీఎం. ఆర్సీ చైర్మెన్ డాక్టర్ తేజవత్ బెల్లయ్య నాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్‌లు పాల్గొననున్నట్లు తెలిపారు. కుల సంఘాలకు, కులమతాలకు, రాజకీయ పార్టీలకతీతంగా ఈ విందు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అందరూ పాల్గొని ఈ ఇఫ్తార్ విందును విజయవంతం చేయాలని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఖడే సంతోష్, ఖలీమ్, జిల్లా మైనార్టీ సెల్ చైర్మెన్ ఎంఏ షకీల్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆఫ్రోజ్ ఖాన్, జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి కాంబ్లీ శివాజీ, యూవజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు షేక్ నహీద్, ఎస్సీ సెల్ అసెంబ్లీ చైర్మెన్ చంద్రాల రాహుల్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తహెర్ ఖాన్ పాల్గొన్నారు.

అకాల వర్షం హెచ్చరిక

నవతెలంగాణ-కడెం

కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వాతావరణ సూచలన మేరకు మంగళవారం నుండి రానున్న మూడు రోజులు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కొన్ని ప్రాంతాలలో ఈదురు గాలులతో గంటకి 30 నుచి 40 కిలో మీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోసరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. రైతులు వెంటనే ఎండబెట్టినటువంటి ధాన్యం, ఇతర పంట ఉత్పత్తుల మీద టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలని తెలియజేశారు.

పేద ముస్లింలకు సేమియా ప్యాకెట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు, మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి పట్టణంలో మంగళవారం సెమియా ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఖుర్షీద్‌నగర్, సుభాష్ నగర్, తాటిగూడ, మహాలక్ష్మివాడలలో సెమియా ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఆదిలాబాద్ పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలకు తనవంతుగా రంజాన్ గిఫ్ట్‌ను అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. అందులో సేమియా, అన్నిరకాల వస్తువులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ దిగంబర్‌రావు పాటిల్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ అంబకంటి అశోక్, పట్టణ మాజీ అధ్యక్షుడు వసీమోద్దీన్, సీనియర్ నాయకులు సైద్‌ఖాన్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కే నాహీద్, అఫ్సర్, జహీర్, బషీర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీని పరామర్శించిన జెడ్పీ చైర్మెన్



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శ్యాంపూర్‌కి చెందిన ఉట్నూర్ వైస్ ఎంపీపీ బాలాజీ మాతృమూర్తి ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా మంగళవారం జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు బాలాజీతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారొద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అధికార పార్టీకి పోలీసులు తొత్తులుగా మారోద్దని, ఎమ్మెల్యే జోగు రామన్న కనుసన్నుల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు తమ వైఖరి మార్చుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసు వ్యవస్థ, డీఎస్పీ తీరు అధికార పార్టీకి పూర్తిగా వత్తాసు పలుకుతూ ప్రతిపక్ష బీజేపీ గొంతును అణచివేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. డీఎస్పీ తీరు మరి విడ్డూరంగా ఉందని అన్నారు. పాలకవర్గం ఎమ్మెల్యేలు ధర్నాలు చేసిన, బంద్‌లు చేసిన పోలీసులు దగ్గరుండి మరి వారికి సహకరిస్తున్నారని అన్నారు. ఒక గ్రూప్ వారు పకడ్బందీ వ్యూహంతో ఎమ్మెల్యే ఆదేశాలతో హిందువులపై దాడి చేస్తే బీజేపీ హిందూ యువకులతో కలిసి డీఎస్పీకి ఫిర్యాదు చేసిందని అన్నారు. కానీ డీఎస్పీ బీజేపీ నాయకులపైన వారి అనుచరులపైన కేసులు పెట్టి వారిని బలవంతంగా నిర్బంధించారనీ విమర్శించారు. ఐఏఎస్ స్థాయి అధికారులు కూడా తప్పు చేస్తే నేడు శిక్ష అనుభవిస్తూ జైల్లో ఉన్నారనే విషయం మర్చిపోవద్దని అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా పని చేయాలని, రాబోయే కాలంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీ పార్టీ నాయకులను ప్రత్యక్షంగా ఎదుర్కోలేక దొడ్డి దారిన చిల్లర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. అనవసరంగా తన కొడుకు పాయల శరత్ మీద అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అంబేద్కర్ జయంతి ర్యాలీలో ఘర్షకు పాల్పడిన వారు బీఆర్ఎస్ నాయకులకు ఎమ్మెల్యేకు సంబంధించినవారని అన్నారు. దానికి సంబంధించిన ఫోటోలను మీడియాకు చూపించారు. అటు హిందూ సంఘాలు, బీజేపీ పిలుపుమేరకు పట్టణ బందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు మున్నా సుభాష్, వేణుగోపాల్, రాష్ట్రపాల్, లోక ప్రవీణ్‌రెడ్డి, రఘుపతి, ఆకుల ప్రవీణ్, జోగు రవి, సోమ రవి, దినేష్ మటోలియ, రాందాస్, రాకేష్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

నాలుగు వరుసల రోడ్డు సర్వేను అడ్డుకున్న బాధితులు

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన ప్రజలు నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనుల ద్వారా తమ విలువైన భూములు, ఇండ్లు కోల్పోతున్నామని రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులలో బస్టాండ్ సమీపంలోని భూములు కలిగిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రకారమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. రోడ్డుకు ఉన్న 66 ఫీట్‌లలోనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్మాణ పనులు జరగనివ్వమని హెచ్చరించారు. సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేపట్టారు. తహసీల్దార్ హనుమంతరావు, సీఐ కృష్ణారెడ్డి బాధితులకు నచ్చజెప్పినా వినకుండా ఆందోళన కొనసాగించారు. దీంతో సర్వే అధికారులు అక్కడి నుండి వెళ్లిపోయారు.

నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వం వెంటనే సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని బీసీ యువజన సంఘం నాయకుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ నిరుద్యోగ యువకులకు 2018లో దాదాపు 4000 మంది నిరుద్యోగులు బీసీ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోన్నారన్నారు. అందులో కేవలం 529 మందికి మాత్రమే రుణం అందించారని, మిగతా వారికి తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీతో కూడిన రుణాలను జిల్లాలోని నిరుద్యోగులకు అందజేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గడ్డల ప్రణయ్ కుమార్, సైదం నాగరాజు, పిప్రే సాయి, గడ్డల కరణ్, అడే సాగర్, దాడి సాగర్ ఆవిడపు తరుణ్, సాయిచరణ్ పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి ఆస్తులకు పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మంగళవారం జీఎం కార్యాలయానికి నోటీసులు జారీ చేశారు. గతంలో సింగరేణి ప్రాపర్టీస్ కేవలం నాలుగు మాత్రమే అసెస్మెంట్స్ ఉండేవని, వాటికి 50 లక్షల రూపాయలు మాత్రమే పన్ను చెల్లించేవారని తెలిపారు. ఇటీవల అక్టోబర్ 22 నుండి నూతనంగా 1581 అసెస్మెంట్స్‌గాను 2022-23 సంవత్సరానికి కోటీ86లక్షల ఇంటి పన్ను పెరిగిందని నోటీసులో పేర్కొన్నారు. మార్చి 31 2023 వరకు జరిమానా రూ.14.86లక్షలు, మొత్తంగా రెండు కోట్ల 71 వెయ్యి రూపాయల పాత బకాయి చెల్లించితే 2023-24 సంవత్సరానికి 5 శాతం ఎర్లీ బర్డ్ స్కీమ్ ద్వారా రాయితీ ఇస్తామని నోటీసులో పేర్కొన్నారు. ఏప్రిల్ 31వ తేదీ లోపు ఇంటి పన్ను చెల్లించని యెడల మున్సిపల్ నూతన చట్టం 2019 ద్వారా సెక్షన్ 87 అనుసరించి సింగరేణి ఆస్తులను జప్తు చేస్తామని తెలిపారు.

ఏకరూప దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికి ఏకరూప దుస్తులను ముందుగానే పంపిణీ చేశామని ఎంఈఓ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. వచ్చే జూన్ 12 నాటికి విద్యార్థుల అందరికి వారి కొలతల ప్రకారం టైలర్‌లతో మాట్లాడి కుట్టించి ఇవ్వాల్సిందిగా ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండలానికి ఇప్పటికే చేరుకున్న గుడ్డను, వివిధ పాఠశాలలకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టాపూర్, పొన్కల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జాడి మురళి, జాజాల శ్రీనివాస్, మనోజ్, దుర్గం శంకరయ్య, సిఆర్పిలు శేఖర్, బుచ్చన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రీన్ మ్యాట్ షెడ్ ఏర్పాటుపై నిర్లక్ష్యం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే గేట్ వద్ద గేట్ పడిన సందర్భంలో వాహనదారులు ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రీన్ మ్యాట్ షెడ్ ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గత నెల బడ్జెట్లో లక్ష రూపాయల బిల్లు పెట్టారు. ఇంతవరకు ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు. పలుమార్లు రైల్వే గేట్ పడడంతో ఎండకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి ప్రయాణికుల సౌకర్యం కోసం గ్రీన్ మ్యాట్ షెడ్లు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ - సిర్పూర్(టి)

మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని ఆలం కమల(45) ఎడమచేయి మణికట్టును కత్తితో కోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. ఎస్ఐ, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..కమల 9 ఏండ్ల నుండి మతిస్థిమితం కోల్పోయి బాధపడుతోంది. ఆమెను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్సకు తీసుకెళ్లారు. మూడేండ్ల నుండి ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకెళ్లినప్పటికీ నయంకాకపోవడంతో మనోవేదనకు గురైంది. సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసింది. రాత్రి ఒంటి గంట సమయంలో గట్టిగా అరుపులు వినిపించగా వెంటనే లేచిచూడగా రక్తపు మడుగులో ఉంది. మృతురాలి కుమారుడు ఆలం రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బీసీ గురుకులాల్లో సమ్మర్ క్యాంపులు రద్దు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో సమ్మర్ క్యాంపుల పేరిట విద్యార్థులను ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని, వెంటనే సమ్మర్ క్యాంపు రద్దు చేయాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర బాధ్యుడు దూలం ఎల్లయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా ఆసిఫాబాద్ గురుకుల పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపుల పేరిట వేసవి సెలవుల్లో కూడా క్లాసులు నిర్వహించటం సరికాదని, సెలవులను విద్యార్థుల ఒత్తిడిని తగ్గించి మానసిక ఉల్లాసం కొరకు వినియోగించేలా చూడాలని తెలిపారు. మండే ఎండలలో ప్రతికూల వాతావరణంలో సమ్మర్ క్యాంపుల పేరిట తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టియస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావ్, నాయకులు హేమంత్ షిండే, రమేష్, వినోద్, చంద్రయ్య, రాధిక, శ్యాం, సంతోష్, రమేష్, లింగయ్య, కొండయ్య గజానంద్ పాల్గొన్నారు.

నేరస్తులు శిక్ష నుండి తప్పించుకోకుండా చూడాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి కేసులో ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేయాలని, కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి నేరస్తులు శిక్ష నుండి తప్పించుకోకుండా చూడాలని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతోపాటు నేరస్థులు శిక్ష నుండి తప్పించుకోకుండా చూడాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలని, పెండింగ్‌లో ఉన్న దొంగతనం కేసులలో పురోగతి సాధించాలని అదేశించారు. కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని అన్నారు. సిసిటిఎన్ఎస్‌లో డాటా ఎంట్రీ ప్రతిరోజూ మానిటర్ చేయాలని సంబంధిత ఎస్ఐలకు సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్‌లను త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలని అదేశించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నియంత్రణ గురించి పోలీస్ కళాబృందం ద్వారా గ్రామాలలో ప్రజలకు విరివిగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రోడ్డు సేఫ్టీ కోసం ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్స్‌కు, సైన్ బోర్డ్‌కు ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి పెయింటింగ్ వేయించాలని, అవసరమైన చోట కొత్తగా ఏర్పాటు చేయడం వంటివి చేయాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బ్లూ కోల్ట్స్ సిబ్బందితో నిరంతరాయంగా ప్రోయాక్టివ్‌గా గస్తీ నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని, ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ చేపట్టి వెంటనే చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ(ఎఆర్) భీమ్‌రావు, ఆసిఫాబాద్ డిఎస్పీ శ్రీనివాస్, కాగజ్‌నగర్ డిఎస్పీ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ ఎస్బి ఇన్‌స్పెక్టర్ సుధాకర్, డీసీఆర్బి ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కరిముల్లఖాన్, సిఐలు రాణా ప్రతాప్, శ్రీనివాస్, బుద్ద స్వామి, నరేందర్, రామకృష్ణ, నాగరాజు, సాదిక్ పాషా పాల్గొన్నారు.

పోయిన మొబైల్ కనుక్కునేందుకు కొత్త అప్లికేషన్

ఎవరివైన మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే కనుక్కోవడానికి సిఈఐఆర్ అనే కొత్త అప్లికేషన్ అందుబాటులోకి వచ్చినట్లు ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. అధికారులతో కొత్త అప్లికేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోయిన మొబైల్ కనుక్కోవడానికి గతంలో ఎన్నో అప్లికేషన్స్ ఉన్నాయని దానికి తోడుగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అందుబాటులోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ అప్లికేషన్ ద్వారా మొబైల్ ఫోన్ ఐఎంఈఐ నెంబర్ బ్లాక్ చేయాలనుకున్నవారు పోలీస్ స్టేషన్ నుండి ఇచ్చే మొబైల్ లాస్ రిపోర్ట్ ఉండాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు.

వీవోఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ-దండేపల్లి

ఐకెపి వివోఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఐకెపి ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఆయన పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐకెపి వివోఏల సమస్యలు పరిష్కరించాలని కొన్ని రోజుల నుండి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులకు ఎమ్మెల్యేలకు జీతాలు పెంచిన ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలో విఫలమవుతోందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐకెపి వివోఏల సమస్యలు పరిష్కరించాలని, సెర్ఫ్‌ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు రాజలింగు, బానయ్య, లింగన్న మద్దతు తెలిపారు.

ఆసిఫాబాద్ : డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఐకెపి వివోఏలు చేస్తున్న సమ్మె రెండో రోజు కలెక్టరేట్ ఎదుట కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి వివోఏలు ఎన్నో రకాల సేవలు అందిస్తున్నారన్నారు. తాము చేస్తున్న సేవలకు గుర్తింపుగా తమను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం నుండి సరైన హామీ వచ్చేవరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. రెండో రోజు సమ్మెలో వివోఏల సంఘం మండల అధ్యక్షుడు బుద్దు, కార్యదర్శి రమ, నాయకులు ఓమాజీ, పద్మ, ఫర్జానా, ప్రమోద్, జయలక్ష్మీ పాల్గొన్నారు.

జీఎం హామీలు అమలు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

కన్వియన్స్ డ్రైవర్లకు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) బెల్లంపల్లి రీజినల్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సీఐటీయూ కార్యాలయంలో కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో పని చేస్తున్న కాంటాక్ట్ కన్వెయన్స్ డ్రైవర్‌ను అకారణంగా విధుల నుండి తొలగించడంతో అనివార్యంగా కన్వేయేన్స్ డ్రైవర్లు అందరూ గత నెల 9 నుండి నిరవధిక రిలే దీక్షకు వెళ్లారని పేర్కొన్నారు. రిలే దీక్షకు స్పందించిన ఏరియా జీఎం మూడు రోజులలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా విరమించామన్నారు. జీఎం ఇచ్చిన హామీలను రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని తెలిపారు. తొలగించిన కార్మికుని విధుల్లోకి తీసుకోలేదని, అలాగే ఆసుపత్రి బుక్స్ గాని, వేతనాల సమస్య గాని ఒక్కటి కూడా పరిష్కరించ లేదని అన్నారు. దీనిపై అనేకమార్లు జీఎంను కలిసినా ప్రయోజనం కలగలేదని, కలిసిన ప్రతిసారి పరిష్కరిస్తామని చెప్పడం తప్ప సమస్యను పరిష్కరించే దిశగా ముందడుగు వేసింది లేదని పేర్కొన్నారు. దీంతో కార్మికులలో చాలా అసంతృప్తి పెరుగుతుందని, సమస్యలు పరిష్కరించకుంటే అనివార్యంగా ఏప్రిల్ 20 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. సమావేశంలో బెల్లంపల్లి రీజినల్ అధ్యక్షురాలు వేల్పుల కుమారి, కన్విన్స్ డ్రైవర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతి, శివ, నాయకులు సతీష్, వై శ్రీనివాస్, హుస్సేన్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సమస్యలు పరిష్కరిస్తాం



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని మురళీగూడ గ్రామానికి మిషన్ భగీరథ నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటానని ఎంపీడీఓ గంగాసింగ్ అన్నారు. మంగళవారం మురళీగూడ గ్రామంలో ఆయన ఆదేశాల మేరకు మిషన్ భగీరథ డీఈ పృథ్వి, ఏఈ మనోహర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భగా మిషన్ భగీరథ పైపులైన్ వాల్‌లను పరిశీలించి చెడిపోయి స్థానంలో మరమ్మత్తులు చేయాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. పైపులైన్‌లోని ఏర్ వాల్‌లను తీయకూడదని గ్రామస్తులకు సూచించారు. అనంతరం సర్పంచ్ ఈశ్వరితో కలిసి గ్రామంలో పర్యటిస్తూ గ్రామంలో ప్రబలతున్న విష జ్వరాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఉప సర్పంచ్ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి శాంతయ్య ఉన్నారు.

కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టాలి

నవతెలంగాణ-దండేపల్లి

త్వరలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే జన గణనలో కులాల వారీగా గణన చేపట్టాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడెపు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాల వారీగా లెక్కలు చేపట్టకపోవడంతో బీసీ కులస్తులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రిజర్వేషన్ల శాతం నిర్ణయించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. బీసీ కులాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రభుత్వం కుల గణన చేపట్టడానికి ముందుకొచ్చిందని దానికి ఆ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. బీహార్, ఒడిస్సా వంటి రాష్ట్రాల్లో కూడా కుల గణనలు చేస్తున్నాయని వారికి బడ్జెట్ కూడా కేటాయిస్తున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసి జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కోడూరు చంద్రయ్య, మామిడి విజయ్ పాల్గొన్నారు.



అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని డిజిపి అంజన్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణలో అక్రమాలకు పాల్పడడానికి వచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనికోసం ఇతర రాష్ట్రాల నుండి రాష్ట్రానికి వచ్చే రహదారుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. వాటి వద్ద 24/7 నిఘా ఉండాలన్నారు. అనంతరం వ్యవసాయ ఎక్సైజ్ ఇతర శాఖలతో జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయితో కలిసి నిర్వహించిన సమీక్షలో జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద కొత్తగా మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యం గురించి ప్రత్యేక నిఘా కోసం చెక్ పోస్టులు ఏర్పాటు చేయటం జరిగిందని, వాటిలో వాంకిడి, సిర్పూర్-టి మండలంలో వెంకట్రావుపేట్ ఎక్స్‌రోడ్, హుడిక్కి ఎక్స్‌రోడ్ వద్ద మొత్తంగా మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి మన రాష్ట్రం వైపుగా అక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జ్యోతి కిరణ్, జిల్లా ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

49 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేత



నవతెలంగాణ-నస్పూర్

కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నియామకం పొందిన 49 మంది యువతీ యువకులకు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని, దక్షిణ భారతదేశంలోనే సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్ఫేస్‌లో లైట్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా, గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. అలాగే తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ, క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని, సింగరేణిని లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో 3240, సింగరేణి వ్యాప్తంగా 10956 కారుణ్య నియామక పత్రాలు జారీ చేశారని ఎస్ఓ టు జీఎం త్యాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎస్ఓ టు జీఎం త్యాగరాజు, అధికారుల సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదీర్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పిఓ పి.కాంతారావు పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతులను పరామర్శించిన జడ్పీ చైర్‌పర్సన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు వెళుతూ ఆసిఫాబాద్ ఊరు చివరన ప్రధాన రహదారిపై ఎదురెదురుగా కార్లు ఢీకొని గాయపడ్డ మండలంలోని బాబాపూర్ సర్పంచ్ చునార్కార్ లక్ష్మి, రాందాస్ దంపతులను జడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ దంపతులకు ధైర్యం చెప్పారు.

రంజాన్‌కు ఈద్గాలను ముస్తాబు చేయాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని రెండు ఈద్గాలను, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని తహసీల్దార్ రిజాయ్‌అలీ గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని రెండు ఈద్గాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్గా ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేసి ప్రార్థనలకు వచ్చే వారికి ఎండదెబ్బ తగలకుండా శామియానాలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణమూర్తి, వార్డుసభ్యులు ఇఫ్తత్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

జేపీఎస్‌ల నిరసన



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తమ డిమాండ్లను నెరవేర్చాలని, వెంటనే రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, శాంతయ్య, శ్రీకాంత్, రాకేష్, కిష్టయ్య జావిద్, బాపురావు, కుతుబొద్దీన్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 19 ఏప్రిల్ 2023

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-గుడిహత్నూర్



ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై మూత్రపిండాల శస్త్ర చికిత్స చేయించుకున్న మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రషీద్, మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన హెచ్.మారుతిరావ్ సోమవారం మృతి చెందడంతో భాధిత కుటుంబాలను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మనంద్, రమేష్ జాదవ్, సుశీల్ నర్వటే, మాధవ్, రావణ్ ముండే, సలీం ఉన్నారు.

ట్రాక్టర్ అద్దె బిల్లు ఇప్పించాలి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్



గత సంవత్సరం జూన్ మాసంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పనులకు పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన బెల్లపు రమేష్ తన ట్రాక్టర్లను మున్సిపాలిటీకి అద్దెకిచ్చానని తెలిపారు. 30 రోజుల్లోగా ట్రాక్టర్లకు సంబంధించి అద్దె చెల్లిస్తామన్న పాలకులు పది నెలలు గడిచిన అద్దె చెల్లించకపోవడంతో ఆయన జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కలిసి ఈనెల 17న వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తన ట్రాక్టర్లకు సంబంధించిన అద్దె బిల్లు ఇప్పించాలని రమేష్ వేడుకుంటున్నాడు.

ఘాట్ రోడ్డులో కారు, ఆర్టీసీ బస్సు ఢీ

- తృటిలో తప్పిన ప్రమాదం
- మంటలు చెలరేగి కారు దగ్ధం



నవతెలంగాణ-కెరమెరి

కారు, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. మంగళవారం కెరమెరి ఘాట్ రోడ్డులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పవన్‌కుమార్ ఆసిఫాబాద్ నుండి ఆదిలాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఉట్నూర్ వైపు నుండి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో కారు ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కారు యజమాని పవన్‌కుమార్ ప్రమాదాన్ని గుర్తించి వెంటనే కారులో నుండి బయటకొచ్చాడు. తీవ్ర గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. కారులో ఒక్కడే ఉండడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. గాయాలపాలైన క్షతగాత్రున్ని జైనూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఆదిలాబాద్‌కు తరలించారు. కారు యజమాని బంధువుల ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ గంగాధర శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



నవతెలంగాణ-భైంసా

జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయల నిధులు కేటాయించాలని నిర్మల్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ జి.శ్రీనివాస చారి మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్ కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాలు ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప చేసిందేమీ లేదన్నారు. అదే విధంగా అర్హులైన జర్నలిస్టులు అందరికి అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్లు అసూరి సంతోష్, ఎంఎ మాజీద్‌ఖాన్, మహేందర్‌గౌడ్, ఆనంద్, మల్లేష్, గణేష్, రవి, రామ్‌ప్రసాద్, రమేష్, పోతన్న, నానీ భోజన్న, కామాజీ, సాయినాథ్ ఉన్నారు.

నిజాయితీని చాటుకున్న రాథోడ్ శ్రీనివాస్

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని దేవితండాకు చెందిన రాథోడ్ శ్రీనివాస్ మంగళవారం నిర్మల్‌కు వెళుతుండగా జామ్ గ్రామ శివారులో మొబైల్ ఫోన్ దొరికింది. వెంటనే సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మొబైల్ ఫోన్‌ను అప్పగించాడు. పోలీసులు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తిని ట్రేస్ చేసి నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ హర్షద్ మొబైల్‌గా గుర్తించి అతనికి మొబైల్ ఫోన్ అందజేశారు. నిజాయితీని చాటుకున్న రాథోడ్ శ్రీనివాస్‌ను ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రానికి చెందిన మంగలి రాజేశ్వర్ కుమారుడు మహేష్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న నవభారత్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మంగళవారం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బీమాలింగం, ఉపాధ్యక్షులు ఎస్‌డీ నాహిమ్, కార్యదర్శి ఎండీ రియాజ్, కోశాధికారి ఎం.ప్రవీణ్, సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని నియోజక వర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కోసం 14 సంవత్సరాలు ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. అలాగే రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చి ప్రజల సంక్షేమాభివృద్ధి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జెండా ఎగరవేయాలని సూచించారు. మండల కేంద్రంలోని భారీ సభను ఏర్పాటు చేసి చేయడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మెన్ రుక్‌మాన్‌సింగ్, నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

వాతావరణంలో పెను మార్పులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇటీవల వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. మండలంలో మంగళవారం నాడు మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో భానుడి ప్రతాపంతో జనం అల్లాడి పోయారు. జనం బయటికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అత్యావసరం తప్ప బయటకు వెళ్లలేక పోతున్నారు. ఆకస్మాత్తుగా సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో వాతావరణం ఒకే సారి చల్లబడింది. దీంతో జనం కొంత ఉపశమనం పొందుతున్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో వేసవి శిక్షణ శిబిరాల ఏర్పాటుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో మొదటి సారిగా సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మే 1 నుండి 31 వరకు నెల రోజులపాటు నిర్వహించే వేసవి శిబిరాన్ని సంబంధిత అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేసి, విజయవంతం చేయాలని సూచించారు. డీవైఎస్ఓ ద్వారా జిల్లాలో 10 క్యాంపులను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. దీనికి సంబంధించి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. శిబిరాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. పిల్లలకు శిక్షణ ఇచ్చే కోచ్‌లు, వాలంటీర్లను నియమించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే సమ్మర్ క్యాంప్‌లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీఓ, ఎంపీఓ, ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాల్లో ఏర్పాటు చేసే శిక్షణ శిబిరాలకు ఎక్కువ మంది పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ వేసవి శిక్షణలో యోగా, మెడిటేషన్, వాలిబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, మ్యూజిక్, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, మాథ్స్, టెన్నిస్, క్రికెట్ తదితర అంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇందుకు సంబంధించి, వేసవి శిక్షణకు కావలసినవి ఏమేమి అవసరమో ఈ నెల 25వ తేదిలోపు నివేదిక అందజేయాలని అన్నారు. వచ్చే నెల 1 నుండి ప్రారంభమయ్యే వేసవి శిక్షణలో పీఈటీ, పీటీలదే ఎక్కువ బాధ్యత ఉందని తెలిపారు. పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ వేసవి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, అందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ సుధీర్, డీవైఎస్ఓ శ్రీకాంత్, డీఈఓ రవీందర్‌రెడ్డి, పేట అధికారి రమేష్, డీపీఓ శ్రీలత, పీఈటీ, పీడీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఈఎస్ఐ, ఎరియర్స్ చెల్లించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వాటర్ సప్లై వర్కర్స్‌కు ఈఎస్ఐ, ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎ.శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు అగ్గిమల్ల స్వామి మాట్లాడుతూ ఇటీవల సానిటేషన్ సిబ్బందికి ఎరియర్స్ చెల్లించిన విధంగానే మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న వాటర్ సప్లై వర్కర్స్‌కు కూడా ఈఎస్ఐ, ఏడు నెలల ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో వాటర్, ఇంజనీరింగ్ సెక్షన్లలో విధులు నిలిపివేస్తామని హెచ్చరించారు. వాటర్ సెక్షన్‌లో సుమారు 150 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారని అవసరమైతే వారి మార్చి నెల వేతనాన్ని ప్రస్తుతానికి ఆపి ఏరియర్స్‌ను మాత్రం వెంటనే చెల్లించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ శైలజ కార్మికులతో చాలాసేపు ఇష్టా గోష్టిగా చర్చించారు. అనంతరం ఆ దిశగా చర్యలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తూ విధులకు హాజరయ్యారు. ఈ సమావేశంలో కార్మికులు శీతల్, మౌనిక, పోసాని, లక్ష్మి, దేవమ్మ, పోతరాజు, చంద్రశేఖర్, రమేష్, ఆర్.సంతోష్, ప్రమోద్, జి.సంతోష్, బి.విజయ్ పాల్గొన్నారు.

పుర ప్రజావాణికి 25 అర్జీలు...

మంగళవారం ఏర్పాటు చేసిన పుర ప్రజావాణికి మొత్తం 25 అర్జీలు రాగా అందులో రెవెన్యూ 17, టౌన్ ప్లానింగ్ 3, ఇంజనీరింగ్ 4, సానిటేషన్‌కు చెందినవి 1 ఉన్నాయి. అందులో 90శాతం సమస్యలను కమిషనర్ శైలజ అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అనురాధ, డీఈ యూనుస్, ఎంఈ తిరుపతి, యూడీఆర్ఐ శివప్రసాద్, ఆర్ఐ వెంకటేష్, కంప్యూటర్ సిబ్బంది రవీందర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుస్తూ, ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని రిమ్స్ ఎదుట పురపాలకశాఖ తరపున రూ.9లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ముందుగా బౌద్ధుని, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహ ఏర్పాటు విషయమై దళిత సంఘాల నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్. అంబేద్కర్ చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లో 125 అడుగుల భారి విగ్రహాన్ని సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఇటీవల పట్టణంలోనూ నూతన అంబేద్కర్ విగ్రహావిష్కరణ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని అన్నారు. ఎన్నో ఉన్నత చదువులు అభ్యసించిన ఆయన రాజ్యాంగాన్ని రచించి, అందరికి సమాన హక్కులు కల్పించారని కీర్తించారు. పట్టణంలో రూ.2కోట్ల ఇరవై లక్షలతో నిర్మించిన అంబేద్కర్ భవనం నిర్మాణ పనులు సైతం పూర్తయ్యాయని అన్నారు. త్వరలోనే ఆ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటి అధ్యక్షులు దుర్గం శేఖర్, నాయకులు శైలేందర్ వాఘ్మారే, బాబాసాహెబ్ కాంబ్లే పాల్గొన్నారు.

రెండో విడత గొర్ల పంపిణీపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గొల్లకుర్మలకు ప్రభుత్వం అందించే సబ్సిడీ కింద 750 యూనిట్స్‌ల గొర్లను పంపిణీ చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని కుభీర్ పశువైద్యాధికారి విశ్వజీత్ తెలిపారు. మంగళవారం కుభీర్, చోండి, గొడిసెరా, సాంగ్వి, రాజురా, గ్రామంలో రెండో విడత కింద మంజూరు అయ్యే గొల్లకుర్మలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న గొల్లకుర్మలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత కింద 750 యూనిట్లు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. మొత్తం యూనిట్స్ విలువ రూ.17,50,000 ఉండగా లబ్దిదారులు రూ.43,750 డీడీ కట్టగా మిగిలిన సబ్సిడీ రూపంలో ప్రభుత్వం రూ.1,31,250జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయా గ్రామంలో ఉన్న గొల్లకుర్మలు ఈ అవకాశాన్ని వినియోగించుకునేల చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ విశ్వంబర్ ఎంపీడీఓ కవిరాజ్ ఐకేపీ ఏపీఎం రమేష్, ఆయా గ్రామాల సర్పంచులు మీరా విజయ్ కుమార్, చంద్రకాంత్, దత్తుగౌడ్, శ్రావణ్, సురేష్, అశోక్ మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంతోష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, సాయినాథ్, గొల్లకుర్మ సంఘం సభ్యులు ఉన్నారు.

రంజాన్ తోఫాల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫాలను పట్టణంలోని స్థానిక బంగారుగూడ కాలనీలో మంగళవారం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల తీరును ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ మేరకు మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యతను ఇస్తూ సీఎం కేసీఆర్ సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని అన్నారు. పేద కుటుంబాలు పండగను సంతోషంగా నిర్వహించుకోవాలని అన్నారు. అన్నదమ్ముల్లా కలిసి ఉంటున్న వారి మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ది పొందాలని కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఆటువంటి కుటిల యత్నాలకు పాల్పడే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగినేని శ్రీనివాస్, ఇక్బాల్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-ఇచ్చోడ



మండలంలోని ముక్రా (బి)గ్రామానికి చెందిన నాందేవ్, శ్రీకాంత్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బాధిత కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట స్థానిక సర్పంచ్ మారుతి, రాథోడ్ ప్రవీణ్, తానాజీ, ఈశ్వర్ ఉన్నారు.

నేడు ముధోల్‌లో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని జీఎం పంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం ముస్లీంలకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అయేషా అఫ్రోజ్‌ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ముస్లీంలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సబ్ స్టేషన్‌ను సందర్శించిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఉట్నూర్



స్థానిక కేబి ప్రాంగణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు మంగళవారం 33/32 కేవీ లైన్ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్ పార్మర్స్‌ల పనితీరు, ఉపయోగాలు, కరెంట్ ఇన్ పుట్, ఔట్ పుట్ రీడింగ్ నమోదు తదితర వివరాలను విద్యుత్‌శాఖ అధికారులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ నుండే అన్నింటిపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి క్షేత్ర స్థాయి పరిశీలన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు శ్రావణి తెలిపారు. చదువుతో పాటుగా క్షేత్ర స్థాయిలో కొన్ని విషయాలు నేర్చుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు భవిష్యత్ చదువుకునే సందర్భంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించిన పాఠాలు వచ్చినప్పుడు విద్యార్థులకు సులువుగా అర్థం చేసుకుంటారని అన్నారు. వారి వెంట కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని చించాల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేపట్టిన పనులను మంగళవారం ఎంపీడీఓ సురేష్‌బాబు పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ సమగ్ర కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రమైన ముధోల్‌లోని ఉపాధిహామి నర్సరీని పరిశీలించి, సిబ్బందికి సలహాలు ఇచ్చారు. ఉపాధి పనులు, కంటి వెలుగు కేంద్రాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు పని కల్పించాలని తెలిపారు. పని జరిగే చోట కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పవన్ కుమార్, ఏపీఓ శిరీష, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఐక్యతతో బీసీ సంఘాన్ని బలోపేతం చేద్దాం



నవతెలంగాణ-తాంసి

ఐక్యతతో ఉంటూ బీసీ సంఘాన్ని బలోపేతం చేయడానికి అందరం కలిసి కట్టుగా పనిచేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు చిక్కాల దత్తు అన్నారు. మంగళవారం తాంసి, భీంపూర్ మండలాల్లో మండల నూతన బీసీ అడక్ కమిటీ అధ్యక్షులు కన్వీనర్‌ను ఎన్నుకున్నారు. తాంసి మండల అధ్యక్షులుగా ఏక్కల శ్రీనివాస్‌గౌడ్, కన్వీనర్‌గా కోవడాల మహేందర్, భీంపూర్ మండలం అధ్యక్షులుగా సంతోష్, కన్వీనర్‌గా వెంకటేష్‌ను, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంఘం బలోపేతానికి మనం అందరం కలిసి కట్టుగా పని చేసి బలోపేతం చేద్దామని అన్నారు. రాజకీయ రంగాల్లో ముందుకు పోదామని అన్నారు. అందరం ఐక్యంగా ఉంటే ఏదైన సాధ్యం అవుతుందని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులతో మండల నూతన కార్యవర్గ సభ్యులను గ్రామసర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్ తో పాటు బీసీ సంఘం సభ్యులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మహేందర్‌రెడ్డి, సదానందం, కాంతారెడ్డి, రామన్న యాదవ్, నారాయణ, సంతోష్ ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని ప్రధానోపాధ్యాయులు గంగారాం అన్నారు. మంగళవారం మండలంలోని ఆశ్రమ పాఠశాల వడగావ్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తించి, ఇటీవలే పదవీ విరమణ చేసిన బండ లక్ష్మీబాయికి ఆశ్రమ పాఠశాల సిబ్బంది సంతోష్, రామ్‌దాస్, వార్డెన్ మంగళ్‌సింగ్ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం ఎన్ని రోజులు చేద్దామని కాదని, ఆయా శాఖలో చేసిన మంచి సేవకు గుర్తింపు ఉంటుందని అన్నారు. వాచ్‌మెన్‌గా తమ పాఠశాలలో ఆమె చేసిన ఏనిమిది ఏండ్ల సేవ మదిలో ఉంటుందని అన్నారు. ఆమె శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవ్‌రావ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీసెల్ కన్వీనర్‌గా ఆత్రం గంగారాం

నవతెలంగాణ-ఇచ్చోడ

బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ కన్వీనర్‌గా ఇచ్చోడ మండలానికి చెందిన ఆత్రం గంగారాంను నియమించారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ చేతుల మీదుగా మండలంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆత్రం గంగారాం మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు అప్పగించిన ఈ బాధ్యతను వమ్ము చేయకుండా నిస్వార్థంగా పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. బాధ్యతలు అప్పగించడానికి సహకరించినటువంటి జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, జిల్లా నియోజకవర్గ, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు సేద్మకి ఆనందరావ్, నియోజకవర్గం నాయకులు ఆడే గజేందర్, కుంరం కోటేష్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ పాల్గొన్నారు.

ఈద్గా మైదానాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రంజాన్ సందర్భంగా ప్రార్థనల కోసం ఈద్గాకు వచ్చే ముస్లీంలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. షాబ్-ఏ-ఖదర్‌ను పురస్కరించుకొని మంగళవారం ఈద్గా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. పండగ రోజు ప్రత్యేక ప్రార్థనలు జరిగే సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని మతాల పండుగలు ఘనంగా నిర్వహించుకునేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని అన్నారు. చైర్మెన్ వెంట వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కమిషనర్ శైలజ, కౌన్సిలర్ వెనుగంటి ప్రకాష్, కోఆప్షన్ సభ్యులు ఎజాజ్ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

నవతెలంగాణ-నిర్మల్



అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం నిర్మల్ జిల్లాకేంద్రంలోని బోయవాడ సమీపంలోని రహదారి పక్కన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బోయివాడ కాలనీకి చెందిన చరణ్ కుమార్(30) అనే యువకుడు సోమవారం ఓ పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. మంగళవారం ఉదయం కాలనీ సమీపంలో రహదారి పక్కన చరణ్‌కుమార్ మృతి చెంది ఉన్నాడు. గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ మల్లేష్ మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముఖంపై గాయాలు ఉండటంతో కుంటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ), వడ్యాల, రాచపూర్ గ్రామాలలో మంగళవారం ఉపాధి హామీ పనులను ఏపీడీ ఓస ప్రసాద్ పరిశీలించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపీఓ ప్రమీల, టీఏ దినేష్, క్షేత్ర సహాయకులు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పాలనలోనే ప్రజా సుభిక్షం

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



నవతెలంగాణ-తాండూర్

కమ్యూనిస్టుల పాలనలో బడుగు బలహీన వర్గాల ప్రజలు ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగిస్తారని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. మంగళవారం సిపిఐ పోరు యాత్రలో భాగంగా తాండూర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. ప్రస్తుత పాలకులు రాచరిక, కుటుంబ పాలనను ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు పేద ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలను మరిచి, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే విధంగా కుట్ర పన్నుతున్నాయన్నారు. కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి, ఓడరేవులు, స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేటర్లకు కట్టబెడుతోందన్నారు. సింగరేణి కంపెనీని ప్రైవేట్‌పరం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, దీనివల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాటాలు చేసి ప్రతిఘటించాలన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో 15 ఏళ్ల పాటు పాలన కొనసాగించిన కమ్యూనిస్టులు పేద ప్రజల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఎమ్మెల్యేగా మల్లేష్ ఎంతగానో కృషి చేశారని తెలిపారు. భూపోరాటంలో సిపిఐ ముందుంటుందని, తెలంగాణ సాయుధ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమి పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టులదని తెలిపారు. సాయుధ పోరాటంలో భాగంగా 400 మంది కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. రాబోయే రోజుల్లో కమ్యూనిస్టులకు అవకాశం ఇచ్చినట్లయితే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. బహిరంగ సభలో నాయకులు రేగుంట చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యదరి బద్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ఐకేపీ వీవోఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. వీవోఏల సమ్మె మంగళవారం రెండవరోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ముంజం ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వీవోఏలు సమస్యలు పరిష్కరించాలని కొన్ని రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు జీతాలు పెంచిన ప్రభుత్వం వీవోఏలకు జీతాలు ఎందుకు పెంచడం లేదో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వీవోఏ ఉద్యోగుల సంఘం నిరవధిక సమ్మె బాట పట్టారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, వీవోఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి సిరిశెట్టి శ్రీనివాస్, వనిత, గీత, వినోద్, సంధ్య, లత, ధనరాజ్, అంకయ్య, లలిత, పురుషోత్తం, లక్ష్మి, పెంటయ్య పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో రెండో రోజు మంగళవారం కూడా వీఓఏల సమ్మె కొనసాగింది. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని మండల ప్రధాన కార్యదర్శి ఆయిల్ల శంకర్ హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు మాధవరావు, నీలయ్య, కేశవ్, సుజాత, జలపతి, జయసుధ పాల్గొన్నారు.

కౌటాల : సమస్యలు పరిష్కరించాలని సమ్మెలో భాగంగా వీఓఏలు ఐకేపీ కార్యాలయం ముందు శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ హరీష్‌కు అందజేశారు. కార్యక్రమంలో వీఓఏల మండలాధ్యక్షుడు ఎర్రోల్ల వెంకటేశ్, రవి, జిల్లా ఉపాధ్యక్షుడు దత్తు, వీఓఏలు దొండు, భీంరావు, దేవాజీ, కొండయ్య, మహేశ్వరి, పద్మ, ఇందు, సీఐటీయూ నాయకులు కృష్ణమాచారి, నగేష్ పాల్గొన్నారు.

కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్

నవతెలంగాణ-ఖానాపూర్

కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ జేకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సీఎం కేసీఆర్‌లకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వడం వల్లనే ఈరోజు కేసీఆర్ సీఎం అయ్యారని, పార్టీ లేకుంటే ఆయన ఎక్కడ ఉండే వారిని ప్రశ్నించారు. బంగారు తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారని అన్నారు. దోచుకున్న డబ్బుతో దేశంలో బీఆర్ఎస్ పేరుతో ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టే స్థాయికి ఎదిగారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఎన్నో సంక్షేమ పథకం ప్రవేశపెట్టిందని పేదలకు ఇందిరమ్మ ఇల్లు, ప్రతి గ్రామంలో నిర్మించిందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్‌ల పేరుతో ఏ ఒక్క గ్రామంలో పేదలకు ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. రేషన్ దుకాణాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది రకాల సరుకులు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కేవలం పురుగుల బియ్యం అందిస్తూ ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. పార్లమెంటులో రాహుల్ గాంధీనీ ఎదుర్కోలేకనే ఎంపీ సభ్యత్వంపై బహిష్కరణ వేటు వేశారని విమర్శించారు. నిరుద్యోగుల సమస్యపై, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే చేపట్టే కార్యక్రమాలపై వచ్చే నెలలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ సత్యాగ్రహ దీక్ష చేపట్టడం జరుగుతుందన్నారు. ఆదివాసీ గిరిజనులకు పట్టాలివ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేసిందని బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం దశాబ్దాల నుంచి సాగుచేసుకుంటున్న భూములను లాక్కుంటుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఖానాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, పార్టీ మండల అధ్యక్షులు దయానంద్, పట్టణ అధ్యక్షులు షబీర్ పాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాడర్ల గంగా నర్సయ్య, తోట సత్యం, నియోజకవర్గ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్తిడిలో రంజాన్ తోఫా పంపిణీ

బెజ్జూర్: మండలంలోని మర్తిడి గ్రామంలో రంజాన్ పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ముస్లిములకు అందిస్తున్న తోఫాను మంగళవారం మండల కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గురిజాల వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ శాఖ అధికారుల దాడులు

సిరికొండ: మండలంలోని వాయిపేట్, చిమ్మన్‌గుడి, ఫకీర్ నాయక్ తండ, కుంటగూడ గ్రామాలలో మంగళవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఒకరిపై కేసు నమోదు చేశారు. 3లీటర్ల నాటు సారా, 100 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ ఎస్సై సిహెచ్ లక్ష్మణ్ కుమార్, సిబ్బంది రమేష్, దేవేందర్, సంధ్య, మహమ్మద్, మంజుల, అర్జున్ పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ - కౌటాల

మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఎంఆర్‌సీ కార్యాలయం ముందు నిరసన తెలిపి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల విద్యాధికారి సోమయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ మధ్యాహ్నభోజన కార్మికులు భోజనం వండిపెట్టినప్పటికీ పెరిగిన ధరలతో పోల్చితే బడ్జెట్ సరిపోవడంలేదని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికులు భోజనం వండిపెట్టడం వల్లనే బడీడు పిల్లలు బడి బయట ఉండకుండా హాజరు శాతం పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 54 వేల మంది కార్మికులు పేద, గిరిజన, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేస్తున్నారని, వారికి శ్రమకు తగిన ప్రతిఫలం రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశార. కనీస వేతనం కల్పించి సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడాలన్నారు.



మధ్యాహ్నభోజన కార్మికులకు పెరిగిన ధరలతో సమానంగా బడ్జెట్ కేటాయించి కార్మికులకు ఇచ్చే రూ.రెండు వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మోర్లె నాగేష్, మధ్యాహ్నభోజన పథకం జిల్లా అధ్యక్షురాలు కె శారద, కార్మికులు కమల, లక్ష్మి, పర్వతాబాయి, సింధూబాయి, నిర్మళ, తారా పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిలింగ్ మెంబర్‌గా ఆసూరి సంతోష్ కుమార్

నవతెలంగాణ-నిర్మల్



టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ఖానాపూర్ నవతెలంగాణ విలేకరి ఆసూరి సంతోష్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నిర్మల్ ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో మంగళవారం టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవదాస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు జగన్నాథం శ్రీనివాస చారి, ఎంఏ మాజిద్‌ఖాన్‌లు ఘనంగా సన్మానించారు. నూతనంగా రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన సంతోష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం నిరంతరం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఆనంద్, మల్లేష్, గణేష్, రవి, రామ్ ప్రసాద్, రమేష్, పోతన్న, నానీ భోజన్న, కామాజీ, సాయినాథ్ ఉన్నారు.

వడదెబ్బతో యువతి మృతి

నవతెలంగాణ-ఉట్నూర్

వడదెబ్బతో యువతి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో పులిమడుగు గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిమడుగు గ్రామానికి చెందిన తాలాజి సంతోష్ లలితల రెండో కూతురు పరమేశ్వరీ సాయింత్రం సమయంలో బహీర్భూమికి వెళ్లి వచ్చింది. నాకు కండ్లు తిరుగుతున్నాయనుకుంటూ కుప్పకులిపోయింది. అకస్మాత్తుగా కూతురు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఏలాంటి అనారోగ్యం లేదని కేవలం తీవ్రమైన ఎండ ఉండటంతో ఎండదెబ్బ తగిలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. తమది బీద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ జాదవ్ సరిత, శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని డొంగుర్గాం సుద్దవాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను మంగళవారం రెవెన్యూ సిబ్బంది పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు తహసీల్దార్ శ్రీకాంత్ జరిమానా విధించారు. అనుమతి పత్రాలు లేనిదే ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ధనార్జనే ధ్యేయంగా రాత్రి వేళల్లో సైతం సుద్దవాగు నుండి ట్రాక్టర్లు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రాక్టరుకు రూ.800 చెల్లించి రశీదు తీసుకొవాలని అన్నారు. ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటలలోపే ఇసుక రవాణా జరిగేలా చూడాలని ఇటీవల కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కానీ అందుకు పరిస్థితి భిన్నంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

అగ్ని ప్రమాదాల నివారణ మాక్ డ్రిల్

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

ప్రత్యేకమైన మాక్ డ్రీల్ ప్రదర్శనతో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మండలంలోని తర్లాపాడు గ్రామపంచాయతీ ఆవరణలో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించిన సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలను సిబ్బంది వివరించారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్లు, గ్యాస్ లీకేజీలపై పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రాధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది హరికృష్ణ, ముబీన్, శంకర్, సత్తన్న, వెంకటేష్, చిన్నయ్య, దిలీప్, కృష్ణలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-సారంగాపూర్

అన్నివర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ ఆలీ, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చించోలి(బి) సమీపంలో నిర్మల్ పట్టణ ముస్లిమ్ కమ్యూనిటీ ప్రజల కోసం రూ.5కోట్ల 30 లక్షలతో 10 ఎకరాలలో నూతనంగా నిర్మించిన ఈద్గాను ప్రారంభించి మాట్లాడారు.. నిర్మల్ పట్టణంలోని ఈద్గా ముస్లిం ప్రజల ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో 10 ఎకరాల్లో నూతనంగా ఈద్గా ను నిర్మించడం జరిగిందని అన్నారు. రంజాన్, బక్రీద్ పండుగలకు నమాజ్ చేసేందుకు ఇబ్బందులు తొలిగాయని అన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, సొసైటీ చైర్మెన్ మాణిక్‌రెడ్డి, ఎఎంసీ చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ మాధవ్ రావు, నిర్మల్ పట్టణ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.